## దొంగతనాలు - నైతిక ధర్మసూత్రాలు

- తోరణాలు కట్టిన గృహంలో దొంగతనం చేయరాదు.
- శుభకార్య ధనం దొంగిలించి కార్యభగ్నం చేయరాదు.
- బాటసారులను దోచుకున్నప్పుడు దారి ఖర్చులు లేకుండా చేయరాదు.
- ఒంటరియైన స్త్రీని బెదిరించి సొమ్ము కాజేయకూడదు.
- చిన్నపిల్లల వంటి మీద ఉన్న ఆభరణాలు దొంగిలించరాదు.
- మంగళసూత్రములు, కాలిమెట్టెలు, నల్లపూసల హారం దొంగిలించరాదు.
- ప్రతిఘటించిన వృద్ధులను, పిల్లలను, స్త్రీలను హతమార్చరాదు.
- దొంగతనంలో హత్యలకు తావుండరాదు.
- ధనము నిల్వ గలిగియుండి దొంగతనానికి బయలుదేరకూడదు.
- బంగారము, ధనము, ఈ రెండింటినీ కలిపి దోచుకోరాదు.
- వికలాంగుల ధనమును క్రూరచోరులు సైతం హరించరాదు.
- అంధుల ధనమును దొంగిలించకూడదు
- వృద్ధాశ్రమాలు, ప్రార్థనామందిరాలు, సత్రాలు, వైద్యశాలలు, దేవాలయాలు అనాధాశ్రమాలలో దొంగతనములు చేయరాదు.
- 16 సంవత్సరాలలోపు వయస్సు గలిగిన వారు దొంగతనం చేసినా, దొంగ పనిగా ఎంచరాదు. శిక్షించరాదు.
- తోడు వచ్చిన దొంగకు దొంగిలించిన సొత్తు వివరములు తెలియజేయాలి.
- తోటిదొంగకు అబద్ధం చెప్పరాదు. మోసం చేయరాదు.

ఇవి సాధారణ చోరధర్మములు.

## లంచగొండులకు - ధర్మసూత్రాలు

- వికలాంగుల వద్ద లంచము తీసుకొనుట నిషిద్ధము.
- పీడించి బహుమతులు గాని లంచము గాని తీసుకొనరాదు.
- సువర్ణం లంచంగా తీసుకోకూడదు. పురుషులు స్త్రీలను స్త్రీలు పురుషులను పరస్పరం లంచాలు అడుగుట నిషిద్ధము.
- ఎదుటివాళ్ళ శక్తికి మించిన ధనాన్ని లంచంగా అడగరాదు.
- లంచము ఇచ్చి వ్యక్తిత్వమును-దేశరహస్యములను కొనరాదు-అమ్మకూడదు.
- ఒకే పనికి ఇద్దరి దగ్గర లంచం అడగరాదు.
- లంచము ఇవ్వలేని వారని తెలిసీ, వారికి సహాయము చేయుదునని వాగ్దానము చేయుట లంచగొండి ధర్మమునకు విరుద్ధము.
- లంచముగా వచ్చిన ధనంలో భాగం అడుగరాదు.
- లంచగొండులను ప్రోత్సహించి వారి ద్వారా ధనమును ప్రోగుచేసి గ్రహించుట అధర్మము.
- మేలు చేయకుండా లంచము గ్రహించుట కూడని పని.
- లంచముగా నిర్ణయించుకున్న ధనమును ఏ కారణము చేతనయిననూ మధ్యలో పెంచరాదు.
- వాహనములు, బండ్లు, ఎద్దులు, జంతువులను లంచముగా గ్రహించకూడదు.
- వయోవృద్ధులను లంచము అడుగరాదు.
- సామూహిక నష్టం కలిగించే లంచం విసర్జించాలి. లంచము ఇచ్చు వాండ్లలో పోటీతత్వము పెంచరాదు.
- విద్య, అన్నము, గూడు, వైద్యము, వస్త్రము, ఉపాధి, శుభకార్యములకు సంబంధిం చిన విషయములలో లంచము తీసుకొనుట నిషేధము.
- లంచగొండి అని తెలిసి ఉచితముగా కార్యము చేసిపెట్టమని అడుగుట కూడా ధర్మ సమ్మతము కాదు.
- వందమంది అవినీతిపరుల మధ్యనున్న నిజాయితీపరుడు అవినీతిపరుడుగా నిరూపించబడతాడు. (కారణం 99మంది వ్యతిరేక సాక్ష్యం చెబుతారు గనుక జన వాక్యం కర్తవ్యం.)

**పాఠకులకు మనవి :**

దొంగతనాలు, లంచాలు ఇతరత్రా సమాజ వ్యతిరిక్తమైనవి ప్రోత్సహించడం నా ఉద్దేశ్యం కాదు. ఈ రెండూ తప్పని చేసేవాళ్లకు "మనకంటే" బాగా తెలుసు. చేసే పని తప్పు-నేరం- (దొంగతనం-లంచం). ఇలాంటి ప్రవృత్తి సమాజంలో అధికమయింది. ఎక్కడ చూసినా లంచాల కుంభకోణాలు, దొంగతనాలు, దోపిడీలు. అవి మానలేని పక్షంలో కనీస ధర్మసూత్రాలు పాటిస్తారని వీటిని తెలియ జేయడమైనది. ఈ ధర్మసూత్రాలు తెలిసినందువల్ల అద్భుతాలు జరుగుతాయని నేను భావించడం లేదు. నా ధర్మం ప్రకారం తెలియజేశాను.

## అత్యున్నత మహాపాశుపత హోమము - విశిష్టత

రుద్రపాశుపతము, అమృతపాశుపతము, కన్యాపాశుపతము అఘోర పాశుపతము, మహాపాశుపతము మొత్తం 16 విధములైన పాశుపతములు ప్రసిద్ధి చెందినవి. పాశుపత మంత్ర పారాయణ అనంతరము హోమం చేయాలి. ఈ హోమం చేయునప్పడు తప్పని సరిగా లింగతోభద్రమండలి కూటమి. ఈ కూటమి సహస్ర లింగసహితం (వెయ్యి శివ లింగాలు -మహా శివలింగానికి-ఆవృతంగా ఉంటాయి) శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి.

| | | | |
|---|---|---|---|
| 1. మొదటి క్రమంలో | 8 | శివలింగాలు | అష్టదిక్కులకు |
| 2. రెండవ క్రమంలో | 12 | శివలింగాలు | ద్వాదశ ఆదిత్యులు |
| 3. మూడవ క్రమంలో | 24 | శివలింగాలు | త్రిశూలములు |
| 4. నాలుగవ క్రమంలో | 400 | శివలింగాలు | తాండశేశ్వరులు |
| 5. అయిదవ క్రమంలో | 8 | శివలింగాలు | అష్టభేతాళులు |
| 6. ఆరవ క్రమంలో | 4 | శివలింగాలు | నాలుగు వేదములు |
| 7. ఏడవ క్రమంలో | 16 | శివలింగాలు | షోడశద్వారపాలకులు |
| 8. ఎనిమిదవ క్రమంలో | 16 | శివలింగాలు | నవతీనవిరాత్ అష్టమూర్తులు |
| 9. తొమ్మిదవ క్రమంలో | 25 | శివలింగాలు | పంచబ్రహ్మలు |

విధానంగా చేయడమే మంచిది.

ములుగు సిద్ధాంతి

## పుట్టిన పిల్లలకు క్షేమం - ఆయుష్యహోమం

పుట్టిన పిల్లల క్షేమం కొరకు - లింగతో భద్రమండలి సహితంగా ఆయుష్య హోమం చేయుట మంచిది; బాలారిష్ట దోషాలు, సిజేరియన్ ఆపరేషన్ దోషాలు, దుర్ ముహూర్త, రాహుకాల వర్జ్య, యమగండ కాలములలో జన్మించిన దోషములు పోయి మంచి జరుగుతుంది.

శుభప్రద కంకణాలు - శక్తివంతమైనవి

| | |
|---|---|
| 1) శ్రీ సిద్ధి గణపతి | : గృహానికి తోరణము వలె సింహద్వారానికి కట్టాలి. రక్షాబంధము దుష్ట శక్తులకు ఇది ఉద్వాసన. |
| 2) అష్టగణపతి పీఠం | : వాస్తు దోషాలు నశిస్తాయి. అనవసర వివాదాలు పోతాయి. |
| 3) ఇంద్రాణి రూపు | : రూపును మెడలో ధరించాలి. శుభప్రదం, శుక్ర గ్రహ దోషం పోయి సౌఖ్యం కలుగుతుంది. స్త్రీ సంబంధిత సమస్యలు ఉపశమిస్తాయి. |
| 4) భద్ర కంకణం | : సర్వాదా క్షేమం. |
| 5) రుద్ర కంకణం | : విజయప్రాప్తి-మనోధైర్యం- ఆరోగ్యప్రాప్తి. |
| 6) భైరవ రూపు | : మెడలో ధరించాలి. శని దోషం పోయి జనాకర్షణ ఏర్పడుతుంది. |
| 7) చతుర్దశ భువనపాలక నారాయణ కంకణం | : వృత్తి వ్యాపారాలలో, నిష్కారణ, శతృత్వం పోతుంది మహానారాయణ కంకణం వల్ల అభివృద్ధి కలుగుతుంది. |
| 8) శక్తి కంకణం | : విద్యా, వ్యాపార రంగములలో మంచి స్థితి సంభవం. |
| 9) పాశుపత కంకణం | : ఉద్యోగప్రాప్తి-వివాహప్రాప్తి. |
| 10) అధి దేవతా కంకణం | : దూర ప్రాంత కార్యాలు సానుకూలం. అమ్మకాలు, కొను గోలు విషయాల్లో రక్షణ కలుగుతుంది. అనుకూల ఫలితాలు |

## పేరు మార్పువల్ల అదృష్టం

జన్మించినప్పడు పెట్టిన పేరు వివాహం సందర్భంగా మార్చుకునే వీలుందని శాస్త్ర సమ్మతము. పేరు మార్చుకుంటే అదృష్టం కలిసి వస్తుందని ఇటీవల కాలంలో చాలా మందిలో ఒక అభిప్రాయం వచ్చింది. ఏ విధంగా పేరు మార్పు చేస్తే అదృష్టం వరిస్తుందో చెప్పమని ఇటీవల చాలామంది అడుగుతున్నారు. ఇది ప్రయోజనం లేని పని. ఎదుటివాళ్ళ అమాయకత్వాన్ని మోసగాళ్ళు తమ స్వార్థానికి వినియోగించుకునే అవకాశం ఉంది. నా పేరు వై.యస్. రాజశేఖరరెడ్డి అని మార్చుకుంటే నా జాతకం మారుతుందా ! జార్జి బుష్ అని, బిల్‌గేట్స్ అని మార్చుకుంటే నాకు అదృష్టం కలిసి వస్తుందా ! రాదు. చూసినవాళ్ళు, విన్నవాళ్ళు నవ్విపోయే అవకాశాలే ఎక్కువ. శాస్త్రం చెప్పవలసిన పరిష్కార మార్గాలు ఇవి కాదు. పేర్లు మార్చుకున్నంత మాత్రాన తలరాత చెరిగిపోదు. ఈ పేర్ల మార్పును సమర్థించే వారు కొందరు ఓ వాదన లేవదీస్తున్నారు. ఏమిటంటే ఉదా: సుబ్బారావు, రామారావు, కామేశ్వరరావు ఇలా రకరకాల పేర్లతో ఉన్నవాళ్ళకు పేర్లు మారిస్తే నవగ్రహాలు పొరపాటు బడి శుభయోగాన్ని ఇచ్చే అవకాశం పుష్కలంగా ఉందిట. నవగ్రహాలు పొరపాటుబడే అవకాశమే లేదు. పోని వాళ్ల అభిప్రాయాన్నే కొద్దిసేపు నమ్ముదాం. పేరు మార్చుకున్న తరువాత నవ గ్రహాలకు బదులు యమభటులు పొరపాటుబడితే పరిస్థితి ఏమిటి? వాళ్ళ వాదన ప్రకారం యమపురికి పోవడమేగా ! భగవంతుడు బతుకుల్ని ఒక్కసారే వ్రాస్తాడు - పలుమార్లు రాయడు.

వ్యక్తిగత జాతకం సక్రమంగా పరిశీలనచేసి, దైవ సంబంధిత శాస్త్ర సంబంధిత వేదప్రోక్తమైన శాంతిక్రతువులు, అనుష్టానము పూజ, నిర్వహిస్తే కొంతలో కొంత మేలు జరుగుతుంది. పేర్లు మార్చుకున్నంత మాత్రాన రాజయోగాలు పట్టవు. సంతకంలో మార్పు వస్తుంది. ఇంతకు మించి మారేది ఏమీ ఉండదు.

## అందమైన అమెరికా

సువిశాలమై సుసంపన్నమైన అగ్రరాజ్యం అమెరికా. ఈ దేశానికి వెళ్లి ఉద్యోగం చేయడమంటే చాలామంది ఇష్టపడతారు. ఈ అమెరికా మోజు నానాటికీ విపరీతం అవుతుంది. కొద్ది సంవత్సరాలు కష్టపడి డాలర్లు సంపాదిస్తే వాటితో స్వదేశంలో ధనవంతు లుగా జీవించవచ్చని కొంతమంది అభిప్రాయం. శాశ్వతంగా అక్కడి పౌరసత్వం తీసుకొని ఉండి పోవాలనుకునే వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. ఇది ధర్మ సమ్మతమా కాదా అనే విషయాన్ని నేను చర్చించదలుచుకోలేదు. ఈ అమెరికా వ్యామోహం వెర్రితలలు వేసి అపశృతులకు అవాంఛనీయ ఘటనలకు దారితీస్తుంది. దీన్ని గురించే ఈ వ్యాసం వ్రాస్తు న్నది. అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడని ముచ్చపడి వైభవంగా వివాహం చేసి అమ్మాయి తల్లిదండ్రులు ఎందరో తల్లడిల్లుతున్నారు. అంతకుమునుపే వివాహం కావడం ఒకటి. అమెరికాలో ఖాళీగా ఉంటు పెద్ద ఉద్యోగం చేస్తున్నానని భ్రమింపచేయడం రెండు. కట్న కానుకలు పేరుతో సర్వం ఊడ్చడం మూడవది. పూర్వాపరాలు ఆలోచన చేయకుండా అమ్మాయి అమెరికాలో సుఖపడుతుందని జీవితాంతం కష్టపడి దాచిన సొమ్మును ఖర్చుచేసి తదుపరి రకరకాల ఇబ్బందులు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న వారిని నేటి సమాజంలో చూస్తున్నాము.

ఈ విషయంలో ఆడపిల్లలు కూడా కొందరు తెలివి మీరిపోయారు. అమెరికాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న అబ్బాయికి ఓ అమ్మాయితో వివాహం నిశ్చయం అయింది. పెళ్లి వైభోగంగా చేశారు. పెళ్లయిన తరువాత సెలవలు తక్కువగా ఉన్నాయని భార్యను తీసుకొని అమెరికా వెళ్లాడు. అమెరికాలోని ఓ మహా పట్టణం ఎయిర్‌పోర్ట్‌లో నవదంపతులు దిగారు. ఎయిర్ పోర్ట్‌నుండి బయటకు రాగానే ఆ అమ్మాయి తన లగేజ్ తీసుకొని అంతకు ముందే సిద్దంగా ఉన్న తన ప్రియుడితో వెళ్లిపోయింది. ఇదేమని ఆ అబ్బాయి (నూతన వరుడు) అడిగితే, 'నా ప్రియుణ్ణి చేరుకొనడానికి వీసా రాలేదు. ఆ వీసా నీ వల్ల వస్తుందని పెళ్లి చేసుకున్నాను. అమెరికా వచ్చేశాను. విడాకులు తీసుకొని గౌరవంగా విడిపోదాం. ఈసారి ఇండియా వెళ్లినప్పుడు మీరు మళ్లీ ఎవరినైనా పెళ్లిచేసుకోండి' అని చెప్పి, తన ప్రియుడితో వెళ్లిపోయింది. అమెరికా వీసా కొరకు ఎంతటి తెగింపు వచ్చిందో ఈ సంఘటనతో అర్థమవుతుంది. విదేశీ వ్యామోహం హద్దులు దాటిపోతుంది.ఇది దేశానికి నుంచి శకునం కాదు. మితిమీరిన వ్యామోహం ప్రతి విషయంలోను అనర్ధానికి దారితీస్తుంది.

## దొంగతనాలు

దేవాలయాల్లో దొంగతనాలు జరిగితే చాలు, వ్యాఖ్యానాలు రకరకాలు వాళ్ల వాళ్ల పరిజ్ఞానాన్ని బట్టి ఆ వ్యాఖ్యానాలు ఉంటాయి. అమ్మవారికి శక్తిలేదు, అయ్యవారికి శక్తిలేదు. ఉంటే దొంగలు రక్తం కక్కుకొని చచ్చేవాళ్ళు కదూ. తన సొమ్ము కాజేస్తేనే ఏం చేయలేని దేవుడు మనకు చేసేదేంటి? ఆలయంలో సరియైన సెక్యూరిటీ లేదు. వాళ్లకు ఆయుధాలు లేవు, జీతాలుకూడా లేవు. కాబట్టి ఇలా జరిగింది. కాదు కాదు పోలీసుల నిర్లక్ష్యం. అసలు ఈ మధ్య ఇటు పోలీస్ బీట్ లేదు మరో వ్యాఖ్యానం. దేవాలయంలో దొంగతనాలు జరిగితే ఇది సాధారణంగా వినపడే వ్యాఖ్యానాలూ. ఆస్తికులకు అంతర్మదన, స్వంత ఇంట్లో సొమ్ముపోయిన దానికన్నా ఎక్కువ బాధపడతారు. ఎవ్వరూ చూడకుండా కన్నీరు పెట్టుకొని ఏడుస్తారు. మహాశయులారా! దొంగతం చేస్తున్న సమయంలో దొంగ కిందపడి రక్తం కక్కుకొని ఛస్తే ఇదే జనం ఏమంటారు. దేవుడికి తన సొమ్ము గురించి జాగ్రత్త ఎక్కువ. అందుకే దొంగను చంపాడు. మన ఇళ్లలో ఎన్నిసార్లు దొంగలు పడ్డారు ఒక్క దొంగనీ దేవుడు ఏమీ చెయ్యలేదు. దేవుడు స్వార్ధపరుడు, తన సొమ్ముమీద ఉన్న శ్రద్ధ మన సొమ్ముమీద లేదు. ఇదే జనం ఈ మాటకూడా అంటారు. అసలు దీని అంతరార్ధం ఏమిటంటే దేవాలయంలో దొంగతనం జరిగి అపచారం జరిగితే జనులకు దుస్సకేతం. ఎందరి మాంగల్యాలకో ముప్ప దాపురించిందని అర్థం. ఆ ప్రాంతానికి చెడు రోజులు రాబోతున్నాయని

గ్రహించాలి. జరిగిన సంఘటనలు ఈ విషయాలనే ఋజువు చేశాయి. చరిత్రను పరిశీంచండి దొంగలను దేవుడు చంపడం ప్రారంభిస్తే దేశంలో చాలా తక్కువ మంది మిగిలే అవకాశం ఉంది.

## అల్పులైన వారికి - అందలం - దీనికి కారణం ఏమిటి

ఎదుటి వ్యక్తి చాలా అల్పమైన వాడని, వానికి గొప్పయోగం పట్టింది. కారణం ఏమిటి? ఎన్ని పూజలు చేసినా, మంచిగా ఉన్నా, సామర్థ్యం, నమ్మకం ఋజువు చేసుకున్నా నాకు యోగం పట్టలేదు అదృష్టం కలిసిరాలేదు పాపాత్ముడికే దేవుడు మంచి రోజులు కల్పిస్తూ ఉన్నాడు. ఇక మేము దేవుడిని నమ్మినందువల్ల ప్రయోజనం ఏమిటి? ఆ పాపాత్ముడు చెయ్యని ఘోరం లేదు, అయినా నిక్షేపంగా ఉన్నాడు. సంస్థను దోచుకుంటున్నాడు. అయినా వాడినే అందరూ నమ్ముతారు. ఇక నీతి, నిజాయితీకి స్థానం ఏది? ఈ విధంగా చాలా మంది అడుగుతారు, బాధపడతారు. దీనికి కారణం వ్యక్తిగతమైన అదృష్టం వల్ల వెలుగులోకి రావడం కాదు, పాపాత్ములకు యోగం పట్టడం. సామూహికమైన దురదృష్టం, సమాజం దుర్యోగం అనుభవించాల్సినప్పడు దుర్మార్గునికి మంచి యోగం పడుతుంది. అప్పడే అందర్నీ బాధించగలుగుతాడు. హిరణ్యా, హిరణ్యకశపుల మాట ఏమిటి. కనుక వ్యక్తిగతంగా బాధపడకూడదు. అనంతకాల చక్రంలో మంచి వాళ్లకూ, చెడ్డవాళ్లకూ యోగావయోగాలు సాధారణమైనవే

## సిజేరియన్ ముహూర్తాలు

భగవంతుని నిర్ణయాలు మానవునికి సంపూర్ణంగా తెలియవు. మహాజ్జాతకులు పుట్టే ముహూర్తాలు వారి పూర్వ జన్మననుసరించి ఉంటాయి. దైవాంశ సంభూతులు, కారణజన్ములు తాము అనుకున్న సమయంలోనే పుడతారు. వారు అనుకున్న కార్యక్రమాలు ధర్మ సంస్థాపన మానవాళికి చేయవలసిన మేలు చేసి, బోధనలు చేసి అవతారం చాలిస్తారు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. అవతార పురుషుడైన షిర్డి సాయిబాబా ఎప్పడు జన్మించారు. ఎవరు ముహూర్తం పెట్టారు. సత్య సాయిబాబా పుట్టడానికి ఎవరు ముహూర్తం పెట్టారు. మహానుభావుల పుట్టుక, వారి నిష్క్రమణ వారి సంకల్పం ప్రకారమే జరుగుతుంది.

ప్రపంచంలో ఎందరో మేధావులు, కోటీశ్వరులు, రాజ్యాన్ని పాలిస్తున్నవారూ ఉన్నారు. వాళ్ళు పుట్టడానికి ఎవరు పెట్టారు ముహూర్తాలు? భగవంతుడు చేసే పనులు మానవుల వల్ల అవుతాయా? శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, ఆదిశంకరులు - వారు అనుకున్న సమయంలో జన్మించి ధర్మ సంస్థాపన చేశారు. పౌలస్త్య బ్రహ్మ (రావణ బ్రహ్మ) బ్రహ్మ వంశంలో జన్మించి, తపస్సుతో శివుని మెప్పించి అనేక వరాలు పొందిన మహాతపస్వి. వేద వేదాంగాలను, ధర్మసూక్ష్మాలను గ్రహించిన మహాపండితుడు. సాహిత్య, సంగీత, జ్యోతిష్య, వాస్తు శాస్త్రములలో మహాపండితుడు. శ్రీరాముని విజయ ప్రాప్తికి హోమం చేసిన మహాయజ్ఞకర్త, నవకోటి లింగార్చన నిత్యము ఆచరించిన అఖండ పూజా దురంధరుడు. ఇంతటి మహాపండితుడు తన కుమారుని (మేఘనాధుడు) జన్మలగ్నం నిశ్చయించి పరోక్షంగా అతని మృతికి కారకుడైనాడు. ఏకాదశస్థాన శుద్ధి లేకపోవటమే మేఘనాధుడను ఇంద్రజిత్ మరణానికి కారణం. రావణబ్రహ్మ పాండిత్యాన్ని కాదనగలమా కాదు. భగవత్ సంకల్పానికి ఎదురు ఈదలేకపోవడమే. దేవతలకు గురువైన బృహస్పతి ఖాండవ వన నిర్మాణానికి ముహూర్తం పెడితే శ్రీకృష్ణపరమాత్మ సంకల్పం వల్ల ఆ వనం దగ్ధమైనది. మానవ ప్రయత్నాలు భగవంతుని అనుగ్రహం పొందే విధంగా ఉండుట ఎప్పటికైనా శ్రేయస్కరం.

జాతకం చూడడం అంటేనే శివ సంకల్పాన్ని తొంగి చూడడం. ఇదెంతో కష్టమైన పని. జ్యోతిష శాస్త్రంలో నిపుణతో పాటు దైవానుగ్రహం వాక్ శుద్ధి కావాలని పెద్దలు చెబుతారు. శిశువు జన్మించే ముహూర్తం పెట్టటం అంటే బ్రహ్మ

- విష్ణు - మహేశ్వరుల పనిని జ్యోతిష్కుడు తనమీద వేసుకోవడమే. అయుః ప్రమాణం - ఆరోగ్యం , విద్య, నడవడిక, వివాహం, పిల్లలు, ఉద్యోగం ఒకటేమిటి సమస్త కర్మలు, యోగాలు, అవయోగాలు, రాబోయే జన్మతో సహా ముడిబడిఉండే జన్మ ముహూర్తాన్ని నిర్ణయించే శక్తి మానవుడికి ఉండదు. జ్యోతిషం తెలిసినంత మాత్రాన మానవుడు దేవుడైపోడు. దైవత్వం రాదు. బిఎ., బికామ్, కంప్యూటర్ ఇంజనీర్ ఇలాంటి చదువుల లాగానే జ్యోతిషశాస్త్రం కూడా చదివి, గురువులు ద్వారా నేర్చుకునే విద్య. ఇంతమాత్రానికే భూత, భవిష్యత్, వర్తమానాలను చూసే దివ్యశక్తి వచ్చిందని భావిస్తే అది పొరపాటే అవుతుంది.

శ్రీ.ఎ.బివాజ్‌పాయి గారు హిందుధర్మశాస్త్రాన్ని బాగా గౌరవిస్తారు వారి ప్రక్కన నిత్యం ఉండే గొప్ప నాయకులు కూడా జ్యోతిషం పట్ల సద్భావన, గౌరవం, నమ్మకం కలిగినవాళ్ళే. ఇండియా - పాకిస్తాన్ చర్చలు సఫలం అయ్యేలా ఒక ముహూర్తాన్ని వారికి ఎందుకు సూచించలేకపోయారు? యన్.డి.ఎ కూటమి అధికారంలోకి వస్తుందని శ్రీవాజ్‌పాయి గారు తిరిగి ప్రధాని అవుతారని ఎందరో జోస్యం చెప్పినారు (మీకు గుర్తుంది కదా) ఎన్నికలకు వెళ్లడానికి ఓ మంచి ముహూర్తం వారికి ఎందుకు సూచించలేదు? ఏ ముహూర్తం లేకుండా అసలు లోక్‌సభకు పోటీ చేయకుండా ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ మాటేమిటి? ప్రబలమైన భగవత్ సంకల్పం ముందు జ్యోతిషశాస్త్ర చిట్కాలు పనిచేయవని స్పష్టంగా అర్థం కావటంలా! దేవతలకు గురువైన బృహస్పతి ఖాండవ వన నిర్మాణానికి ముహూర్తం బెట్టాడు. ఖాండవ వనం శ్రీకృష్ణపరమాత్మ సంకల్పం వల్ల దగ్ధం అయ్యింది. తపోబల సంపన్నులు, సమస్త శాస్త్రాలు తెలిసిన బృహస్పతికన్నా అధికులమని భావించే మానవులకు చెప్పగలిగింది ఏమీలేదు.

తన రుద్రవీణా గానంతో పరమేశ్వరుని మెప్పించి ఆత్మ లింగాన్ని పొందిన రావణబ్రహ్మ ఆయన పాండిత్యము విశేషించి జ్యోతిషశాస్త్రంలో ఆయనకున్న ప్రతిభాపాటవాలు పండితులకు స్పష్టంగా తెలుసు. రావణుని పాండిత్యాన్ని శ్రీరాముడే ప్రశంసించాడు. రావణ బ్రహ్మ వాస్తు పరిజ్ఞానం ఎంత గొప్పదో సుందరాకాండలో సవివరంగా ఉంది. ఇలాంటి గొప్ప పండితులే పొరపాటుపడి భంగపడిన సంఘటనలు కూడా చరిత్ర, పురాణాలు, భారత, భాగవత, రామాయణం వంటి గ్రంథములు ద్వారా ప్రజలకు స్పష్టముగా తెలుసు.

సిజేరియన్ ఆపరేషన్ ముహూర్తాల వల్ల అనర్థాలు సంభవిస్తున్నాయి. గ్రహస్థితి భాగుందని ముందుగా ఆపరేషన్ చేసి బిడ్డను బైటికి తీయాలని డాక్టర్లపై వత్తిడి తెస్తున్నారు. ఇది సమంజసమా? దేవుని దృష్టిలో ఇది మంచి పనేనా? మీరే ధర్మనిర్ణేతలు నిర్ణయించండి. ముందుగా పుట్టిన బిడ్డ ఆరోగ్య స్థితికి ఎవరు బాధ్యత వహిస్తారు. నెలలు నిండిన తదుపరి డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటే వద్దు ముహూర్తం బాగాలేదు మరికొన్ని రోజులు ఆగాల్సిందేనని చెప్పడం ఎంతవరకు న్యాయం మీరే నిర్ణయించండి. న్యాయనిర్ణేతలు మీరే. వైద్యో నారాయణో హరిః- వైద్యుల నిర్ణయానికి వదిలివేయండి. ఎప్పుడు ఆపరేషన్ చేయాలన్నది వైద్యుల నిర్ణయము. అదే దైవ నిర్ణయంగా భావించాలి. సిజేరియన్ ముహూర్తాలు నిర్ణయించి జ్యోతిష శాస్త్రనేత్తలకు బ్రహ్మస్థానం కల్పించవద్దు.

